## క్లుప్తంగా

### పాంచాలమ్మకు ఘనంగా పూజలు



కుమారస్వామిరెడ్డిని ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

**నగరి:** పట్టణ పరిధిలోని సత్రవాడ గ్రామంలోని శ్రీపాంచాలమ్మ సమేత పాండవరాయల బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌ సీపీ నాయకుడు వై.కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు. ఆదివారం స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆశీర్వదించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ నీలమేఘం, వైస్‌ చైర్మన్‌ బాలన్‌, కౌన్సిలర్లు, బీడీభాస్కర్‌, మురగ, వైఎస్సార్‌ సీపీ నాయకులు బాలకృష్ణ, అయ్యప్ప, కన్నాయరం, జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



సాలమ్మ మృత దేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

**కార్వేటినగరం:** సురేంద్రనగరం సర్పంచ్‌ పెరియస్వామిరెడ్డి తల్లి సాలమ్మ(85) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి సాలమ్మ మృత దేహంపై పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి అంకిత భావంతో పనిచేసిన పెరియస్వామి తల్లి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. వారి వెంట మాజీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పద్మనాభశెట్టి, వేల్‌రెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

### కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన



కుష్టువ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న లెప్రసీ అధికారి జాన్‌

**పాలసముద్రం:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు కుష్టువ్యాధి (లెప్రసీ) లక్షణాలపై అవగాహన ఉంటే వ్యాధిని అరికట్టుకోవచ్చని లెప్రసీ డిప్యూటీ పారామెడికల్‌ ఆఫీసర్‌ జాన్‌ తెలిపారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, జాన్‌ ఆరోగ్య సిబ్బందితో కలసి సింహరాజుపురం, పాలసముద్రం దళితవాడలో కుష్టువ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లెప్రసీ డిప్యూటీ పారామెడికల్‌ అధికారి జాన్‌ మాట్లాడుతూ చర్మంపై మచ్చలు ఉంటే వాటిపై స్పర్శ ఉందా లేదా పరీక్షించాలని తెలిపారు. కనురెప్పలపై ఉన్న వెంట్రుకలు రాలిపోతాయని, రాగి రంగు గల మచ్చలు ఉంటే కుష్టువ్యాధిగా గుర్తించాలని తెలిపారు. ఇటువంటి కనబడితే వెంటే ఎంబీటీ మందులు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కొంతమందికి ఉన్న మచ్చలను పరిశీలించి, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌ మురళి, సుశీల, ఏఎన్‌ఎం, ఆశా పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి



ప్రమోద్‌(ఫైల్‌)

**గంగాధరనెల్లూరు:** గత బుధవారం అప్పిరెడ్డికండ్రిగ గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో హర్షవర్ధన్‌ రెడ్డి అనే యువకుడు మృతి చెందగా ప్రమోద్‌ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఆదివారం సాయంత్రం ప్రమోద్‌(24) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని బంధువులు తెలిపారు. ప్రమోద్‌ మృతి వార్త తెలుసుకున్న స్నేహితులు వందలాదిగా ఇంటి వద్దకు చేరుకుని అశ్రు నివాళులర్పించారు.

### నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకామాక్షీ సమేత స్వయంభు మొగిలీశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రాహు కాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు కేతు, సర్ప దోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఆలయంలో రాహుకేతు పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, దోష నివారణ చేసుకోవాలని కోరారు.

### నేడు కార్పొరేషన్‌లో గ్రీవెన్స్‌ డే

**చిత్తూరు అర్బన్‌:** చిత్తూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్‌ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

# సరికొత్త ఉపాధి

ఔత్సాహిక రైతులకు, గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పశు సంవర్ధకశాఖ, కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ స్టాక్‌ మిషన్‌ సంయుక్తంగా సరికొత్త పథకాన్ని రూపొందించాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు తదితర జీవాల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీ ద్వారా ఉపాధి కల్పించేందుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయి. తద్వారా పాలు, గుడ్లు, మాంసం, ఉత్పత్తి పెంచి, సరైన మార్కెటింగ్‌ సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ఔత్సాహికులు httpr://dahd.nic.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీరంగరాజపురం



మేత మేస్తున్న మేకలు, (ఇన్‌సెట్‌) షెడ్డులోని మేకలు

- గ్రామీణ యువత, రైతుల ఆర్థిక పురోగతికి పీఎం లైవ్‌స్టాక్‌ మిషన్‌ పథకం
- గొర్రెలు, పందులు, మేకలు, కోళ్లు పెంపకంతో ఉపాధి
- సైలేజ్‌, పశుగ్రాస దిమ్మెలు, సమీకృత దాణా యూనిట్లకు తోడ్పాటు
- భారీగా సబ్సిడీ, రుణ సదుపాయం
- 50 శాతం సబ్సిడీ రెండు దఫాలుగా విడుదల

| గొర్రెలు/మేకలు ఫాం (యూనిట్‌) | రాయితీ (రూ.లలో) |
|---|---|
| 100 గొర్రెలు/మేకలు+5 పొట్టేళ్లు/మేకపోతులు | 10,00,000 |
| 200 గొర్రెలు/మేకలు+10 పొట్టేళ్లు/మేకపోతులు | 20,00,000 |
| 300 గొర్రెలు/మేకలు+15 పొట్టేళ్లు/మేకపోతులు | 30,00,000 |
| 400గొర్రెలు/మేకలు+20 పొట్టేళ్లు/మేకపోతులు | 40,00,000 |
| 500గొర్రెలు/మేకలు+25 పొట్టేళ్లు/మేకపోతులు | 50,00,000 |

- 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్‌ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రె లేదా మేకపిల్లల ఉత్పత్తి, పోషణ చేపడుతారు. ప్రాజెక్టు విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తున్నారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.
- కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా తక్కువ వ్యయంతో సాయం అందిస్తారు. వెయ్యి కోడి పెట్టలు, 100 కోడి పుంజులతో పెరటి కోళ్ల యూనిట్‌ ఉంటుంది. కోడి పిల్లల ఉత్పత్తి, పొడుగు కోళ్ల కోసం రూ.50 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తారు.అంతకన్నా తక్కువ ఉంటే గరిష్టంగా రూ.25 లక్షలు రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ ఇస్తారు.
- 100 ఆడ పందులు, 10 మగ పందులతో యూని ట్‌ ఏర్పాటు చేయవచ్చు. ప్రాజెక్టు విలువ రూ.60 లక్షలు అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.30 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం, అలాగే 50 ఆడ పందులు, 5 మగ పందులు యూనిట్‌కు గరిష్టంగా రూ.15 లక్షలు వరకూ రాయితీ ఇస్తారు.
- పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజీ తయారీ, పశుగ్రాస దిమ్మెల తయారీ, సమీకృత దాణా తయారీ యూనిట్లకు ఆర్థిక సాయం చేస్తారు. యూనిట్‌ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు.

**లబ్ధిదారులు ఎంపిక**

- అనుభవం ఉన్న వ్యక్తిగత పశు పోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్‌ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్‌–8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.
- లబ్ధిదారులు సంబంధిత ప్రాజెక్టులో శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్టు నిర్వహణపై అవగాహన అవసరం
- రాయితీ పోను మిగిలిన యూనిట్‌ విలువను బ్యాంక్‌ రుణంగా పొందడానికి అవసరమైన పత్రాలను సమర్పించాలి. బ్యాంక్‌ అనుమతి తప్పనిసరి
- మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదిక తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలి
- సొంత లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి. వీటిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం అర్హతలున్న వారిని ఎంపిక చేసి, జాతీయ లైవ్‌స్టాక్‌ మిషన్‌కు పంపిస్తారు.

**రాయితీ సబ్సిడీ విడుదల**

- 50శాతం సబ్సిడీ రెండు దఫాలుగా విడుదల చేస్తారు.
- బ్యాంక్‌ మొదటి దశ రుణం లబ్ధిదారులకు అందిందనే విషయాన్ని ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని సంబంధిత బ్యాంక్‌కు జమ చేస్తారు. ఆ సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాలో ఆ బ్యాంక్‌ జమ చేస్తుంది.
- ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధ్రువీకరించుకుని రెండో దఫా సబ్సిడీకి కూడా లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

**అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**



జాతీయ లైవ్‌స్టాక్‌ మిషన్‌ పథకంపై గ్రామీణ యువతకు, ఔత్సాహిక రైతులకు సచివాలయంలో ఉన్న రైతుసేవా కేంద్రంలో అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం రైతులకు కష్టంగా మారింది. పశు సంవర్ధక శాఖ సిబ్బంది కూడా అవగాహన కల్పిస్తున్నాం. మండలానికి 200 యూనిట్లు నెలకొల్పి, పాలు ,గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్‌ ప్రభాకర్‌, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, చిత్తూరు

**సద్వినియోగం చేసుకుంటాం**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటాం. ఈ పథకం గురించి తెలుసుకున్నాను. ఇటీవలే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. దాదాపు 50 మేకలు ఉన్నాయి. బ్యాంక్‌ వారు కూడా సానుకూలంగా స్పందించారు. ఈ పథకం ద్వారా రుణాలను పొంది నా మేకల పెంపకాన్ని అభివృద్ధి చేసుకుంటాను. ఎక్కువ మంద ఉంటే లాభాలను ఆర్జించుకోవచ్చు.

– ఎం.వెంకటేష్‌, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురమ మండలం

# వైభవంగా తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు



గ్రామ వీధుల్లో శ్రీవేణుగోపాలుడి ఊరేగింపు

**కార్వేటినగరం:** తెప్పోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండో రోజు ఆదివారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను పట్టు వస్త్ర సుగంధభరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7 గంటల నుంచి స్కంధ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై స్వామివార్లను ప్రతిష్టించి 5 చుట్లు తిప్పారు. దీంతో తెప్పోత్సవాన్ని తిలకించడానికి హాజరైన అశేష జనవాహినికి తెప్పపై ఆశీనులైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారు అభయమిచ్చారు. భక్తులు గోవింద నామాన్ని స్మరించుకుంటూ స్వామివారికి స్కంధ పుష్కరిణిలో కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్‌, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌పాస్‌ బ్రిడ్జి నిర్మించండి



జీడీ నెల్లూరు వద్ద పూర్తిగా ధ్వంసమైన రోడ్డు, నిలిచిపోయిన వర్షపు నీరు



ముక్కలతుత్తూరు వద్ద ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్రవాహనం(ఫైల్‌)

**గంగాధరనెల్లూరు:** ముక్కలతూరు గ్రామ సమీపంలో చిత్తూరు–తర్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే అండర్‌ పాస్‌ నిర్మించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిపై పలుమార్లు రోడ్డు నిర్మించే కంపెనీ వారికి సైతం విన్నవించుకున్నామని, ఇకనైనా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు కల్పించుకుని అండర్‌ పాస్‌ బ్రిడ్జి నిర్మించాలని చుట్టుపక్కల గ్రామస్తులు కోరుతున్నారు. గంగాధరనెల్లూరు నుండి కట్టకిందపల్లి వరకు నిర్మాణ కంపెనీకి సంబంధించిన లారీలు భారీ ఎత్తున లోడ్‌లతో ప్రయాణిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వర్షం వస్తే పెద్ద గుంతలుగా ఏర్పడి నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు పడిపోతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక్కడ కూడా రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన సోమవారం శ్రావణ పౌర్ణమి(రాఖీ పౌర్ణమి) సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతరావు తెలిపారు. ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు స్వామివారికి అభిషేకం, సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో స్వామికి సుదర్శన హోమం నిర్వహిస్తామని వివరించారు. వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు నిర్వహిస్తామని ఈఓ హనుమంతరావు పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

### డప్పు కళాకారుల నూతన కార్యవర్గం






డి.వెంకటరమణ, కె.మురగారెడ్డి

**పుత్తూరు:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారుల సమస్యల పరిష్కారం కోసం సంఘం అహర్నిశలు కృషి చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఓ ప్రైవేట్‌ పాఠశాలలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా దళిత డప్పు కళాకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రవారిపాళెంకు చెందిన డి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కె.మురగారెడ్డిని, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం డప్పు కళాకారులకు 45 ఏళ్లకే పింఛన్‌ అందజేయాలని, అలాగే దుస్తులు, వాయిద్య పరికరాలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షాకాలం... పాముల కలకలం





ఎస్‌ఆర్‌ నగర్‌లో ఇంటి గేటు పక్క నుంచి లోపలకు వస్తున్న పాము, బీజీసీ లేఅవుట్‌లో వీధిపైకి వచ్చిన పాము

**నగరి:** తరచూ వర్షాలు పడుతుండడం, ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన పొదల్లోకి వర్షపు నీరు చేరడంతో విష సర్పాలు రోడ్లపైకి, పక్కనే నివాసాల్లోకి చొరబడుతున్నాయి. వాహనదారులను, నివాసం ఉన్నవారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల జాతీయ రహదారిపై ఏడు అడుగుల పామును చూసి వాహనదారులు హడలి పోయారు. బైపాస్‌ రోడ్డులో బీజీసీ లేఅవుట్‌ నివాస ప్రాంతంలో వీధిపైకి పాము వచ్చిన హల్‌చల్‌ చేసింది. సత్రవాడ శివారుల్లో ఒక ఇంటిలోకి నాగుపాము చొరబడడంతో స్నేక్‌ క్యాచర్‌ను తీసుకువచ్చి పట్టి దూరంగా తీసుకెళ్లి వదలిపెట్టారు. ఎస్‌ఆర్‌ నగర్‌లో నివాసాల వద్ద పూల కుండీల పక్కన, ఇంటి గేట్ల పక్కన చిన్న పాములు కనిపిస్తూ స్థానికులను కలవరపెడుతున్నాయి. దీంతో ఇంటి ఆవరణలోని పూల కుండీలు, చెట్ల వద్దకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోకుండా వదిలేస్తుండడంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పొదల్లా తయారై పాములకు ఆవాసంగా మారుతున్నాయి. మున్సిపల్‌ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక చర్యలు చేపట్టి ఖాళీస్థలాలను వాటి యజమానుల ద్వారా శుభ్రం చేయిస్తే పాముల బెడద ఉండదని స్థానికులు కోరుతున్నారు.

# అట్టహాసంగా అగ్నిగుండ మహోత్సవం

- కల్పవృక్షం, సూర్యప్రభలపై ద్రౌపదీదేవి విహారం
- బ్రహ్మోత్సవాలకు బ్రహ్మరథం పట్టిన భక్త జనం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

**పుత్తూరు:** శ్రీద్రౌపదీదేవి సత్యశీలతకు ప్రతీకగా నిర్వహించే అగ్నిగుండ ప్రవేశం అట్టహాసంగా నిర్వహించారు. పుత్తూరు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం చివరి ఘట్టమైన అగ్నిగుండంలోకి 3 వేల మందికి పైగా భక్తులు ప్రవేశించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలం బాబు, మోహన్‌ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వామివారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కల్పవృక్ష వాహనంపై శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జున స్వామివారు పురవీధుల్లో విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు. 10గంటలకు రజక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం కోసం భక్తులు ఆలయం వద్ద కంకణాలు ధరించారు. ప్రతిఏటా మగవారితోపాటు మహిళలు సైతం అగ్నిగుండ ప్రవేశం చేయడం విశేషం. కంకణధారులైన భక్తులు 9 బావుల్లో స్నానాలు ఆచరించి చివరగా మంచినీళ్ల గుంట వద్దకు చేరుకున్నారు. అక్కడ మగవారు పసుపు పంచె, మహిళలు పసుపు చీరతోపాటు తలకు పూలు చుట్టుకొని ముస్తాబు అయ్యారు. సాయంత్రం 6 గంటలకు గెరిగ ఊరేగింపుగా ముందు వెళుతుండగా వెనక అగ్నిగుండ కంకణధారులైన భక్తులు బారులు తీరి అనుసరించారు. గెరిగ ఆలయానికి చేరుకోగానే ద్రౌపదీదేవి, పోతురాజు ఉత్సవమూర్తులను అగ్నిగుండం వద్ద కొలువుదీర్చారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు బాబు ముందుగా అగ్నిగుండం నుంచి నిప్పును తీసి అమ్మవారి పైటకొంగులో వేశారు. పూలబంతిని అగ్నిగుండంలో వేసి భక్తులను అనుమతించారు. గోవిందనామ స్మరణలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమాలు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. అగ్నిగుండ ప్రవేశం పూర్తయిన అనంతరం ఆలయంలోని అలుగు కుంభాగ్రం నుంచి కత్తి పరిగ్రహించబడింది. రాత్రి 9 గంటలకు స్థానిక ఆర్టీసీ డిపో వారి ఆధ్వర్యంలో సూర్యప్రభ వాహనంపై శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వామి పురవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులిచ్చారు. అగ్నిగుండ ప్రవేశ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పుత్తూరు పట్టణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమాలను సాళ్వాకం వంశీకులైన ఆలయ కోవిల్‌ కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్‌ మొదలి, గోపి మొదలి, వెంకటేష్‌ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

ఉదయం 7 గంటలకు అగ్నిగుండం శాంతి పూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం, రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న ద్రౌపదీ సమేత అర్జునస్వామి, మంచినీళ్ల గుంట వద్ద భక్తుల సందడి

### ఘనంగా శ్రీశక్తి నాగాలమ్మ ద్వితీయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**చిత్తూరు రూరల్‌(కాణిపాకం):** చిత్తూరు నగరం మురుకంబట్టు బైపాస్‌ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో వెలసిన శ్రీశక్తి నాగాలమ్మ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, 108 శంఖాలతో జలాభిషేకం, కలశ పూజ, వివిధ పుష్పాలతో అలంకరణ, అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వెంకయ్యనాయుడు

**చిత్తూరు రూరల్‌ (కాణిపాకం):** చిత్తూరు అపోలో కాలేజీలో పని చేస్తున్న మహేందర్‌నాథ్‌, ధనంజయ రచించిన 'బేసిక్స్‌ ఆఫ్‌ కార్పొరేట్‌ సోషియల్‌ రెస్పాన్సిబిలిటీ అండ్‌ కార్పొరేట్‌ గవర్నెన్స్‌' అనే పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా స్వర్ణభారత్‌ ట్రస్టు భవన్‌లో ఆదివారం ఆయన్ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుస్తకావిష్కరణ చేశారు. వెంకయ్యనాయుడు నుంచి వారు అభినందనలు అందుకున్నారు.